# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-07-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని గుంతకల్లు – బళ్లారి రైల్వే మార్గంలో 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదం తెలిపింది.**

2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు.**

3. **డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

4. **మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని గుంతకల్లు – బళ్లారి రైల్వే మార్గంలో 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న జరిగిన కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ఒక వెయ్యి 264 కోట్ల రూపాలయని పేర్కొన్నారు. కేంద్ర కేబినెట్ నిర్ణయాలను ఢిల్లీలో ఆయన నిన్న పాత్రికేయులకు వెల్లడిస్తూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షలలో అవకతవకల కేసులలో ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి, కఠినమైన శిక్షలు విధించడానికి ఉద్దేశించిన ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఈ ముసాయిదా బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రశ్నా పత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకునే నిబంధనలతో కూడిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిన్న రాత్రి విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో ప్రకటించారు. ఇదిలా ఉండగా.. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అవకతవకలకు సంబంధించిన

ముసాయిదా బిల్లు ఆమోదానికి ఎలాంటి ఆటంకం ఉండబోదని అన్నారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఆస్పరి మండల కేంద్రంలో 'సంజీవని' కార్యక్రమాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం ఆస్పరిలోని ప్రజావేదికకు చేరుకుని ప్రసంగిస్తారు. అనంతరం ఆసుపత్రికి చేరుకుని రోగులు, ఆరోగ్య సిబ్బందితో ముచ్చటిస్తారు. రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకుంటారు. సాయంత్రం స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు.

--------------------------

పోస్టల్ శాఖ ప్రాధాన్యతను గుర్తించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆ శాఖకు పూర్తి స్థాయిలో జవసత్వాలు తీసుకువస్తున్నారని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులో ఆధునికీకరించిన రెండు సబ్ పోస్టాఫీసులను నిన్న ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మరో ఆరు నెలల్లో జియోట్యాగింగ్ సదుపాయంతో కూడిన బట్వాడా సేవలను ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. పూర్తి స్థాయి డిజిటల్ ఆర్థిక వ్యవస్థను తీసుకురాగలిగితేనే అవినీతిని తగ్గించడం సాధ్యమవుతుందని మంత్రి పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

--------------------------

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల నివారణ, భద్రత కమిటీలపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగిస్తే వాటి యాజమాన్యాలను బాధ్యులను చేయాలన్నారు. విద్యా సంస్థల క్యాంపస్‌లతో పాటు వాటి వెలుపల విద్యార్థులకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి సమాచారం అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు విద్యా సంస్థల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

--------------------------

మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా పేటేరు గ్రామంలోని డ్వాక్రా సంఘ సభ్యులకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా మంజూరైన 10 లక్షల రూపాయల రుణంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మగ్గం వర్క్ యూనిట్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఉపాధి కల్పన పథకాల ద్వారా రుణాలు పొందుతూ చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ, తెలంగాణలోని చిట్యాల డ్రై పోర్టు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని కేంద్ర ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. లోక్‌సభలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కొత్త డ్రై పోర్టుల ఏర్పాటుకు లాజిస్టిక్స్ సాంద్రత ఆధారంగా రాష్ట్రాలను వివిధ జోన్లుగా వర్గీకరించినట్లు వివరించారు. తెలంగాణను గ్రీన్ జోన్‌లో చేర్చి, అక్కడ డ్రై పోర్టుల కనీస విస్తీర్ణ పరిమితిని 7 హెక్టార్ల నుంచి 3 హెక్టార్లకు తగ్గించినట్లు తెలిపారు. పారిశ్రామిక డిమాండ్, మౌలిక సదుపాయాల అవసరాల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో కొత్త డ్రై పోర్టులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 136వ సంచిక రేపు ఉదయం 11 ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

వచ్చే నెల 1న నిర్వహించనున్న విజయనగరం జిల్లా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాల నుంచి సుమారు 3 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రులు వి.అనిత, కె.అచ్చెన్నాయుడుతో కలిసి నిన్న పరిశీలించిన అనంతరం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భాంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరువుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి స్వాగతం పలికేందుకు 13 వేల మందితో ధింసా నృత్య ప్రదర్శన నిర్వహించాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు, అల్పాహారం, భోజనం అందించాలని ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

తెలంగాణలో రానున్న 4 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ –ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిన్నటితో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 4 కోట్ల 16 లక్షల 27 వేల 694 మంది ఓటర్లు ఉండగా, 3కోట్ల, 71 లక్షల 56 వేల 171 పత్రాల డిజిటలీకరణ ప్రక్రియ పూర్తయ్యిందని అధికారులు వెల్లడించారు. మిగిలిన 44 లక్షల 71 వేల 523 మంది చిరునామా మారిన, మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, పలు పర్యాయాలు నమోదైన ఓటర్లుగా పేర్కొన్నారు.

======================